క్లుప్తంగా

నగరంలో 96.21 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో రెండో స్థానం



మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగరపాలక సంస్థ జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. నగరంలో 19,259 మంది పింఛనుదారులు ఉండగా, వీరిలో 18,530 మందికి పంపిణీ చేసి 96.21 శాతం లక్ష్యాన్ని సాధించారు. ఇంకా 729 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు రాళ్లరేవు విద్యార్థులు



కృత్తివెన్ను: రాష్ట్ర స్థాయిలో జరగనున్న టెన్నికాయిట్ పోటీలకు కృత్తివెన్ను మండలం రాళ్లరేవు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ నాగరాజు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నిర్వహించిన టెన్నికాయిట్ జిల్లా సెలక్షన్స్‌లో అండర్ -14 విభాగం నుంచి పాఠశాలకు చెందిన జి.జితేంద్ర, బి.లహరి అత్యుత్తమ ప్రదర్శన కనపరచడంతో వీరిద్దరూ రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. వీరిని సర్పంచ్ సునీల్, ఉపాధ్యాయులు అభినందించారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

641 మందికి ఉచితంగా వైద్య సేవలు



లక్ష్మీపురం(చల్లపల్లి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం లక్ష్మీపురం గ్రామ సచివాలయం-2 పరిధిలోని శివరామదుర్గాపురం ఎంపీపీ స్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు శిబిరాన్ని ప్రారంభించగా, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు తరలివచ్చి 641 మందికి వైద్య పరీక్షలు చేశారు. నెల రోజులకు సరిపడా మందులు అందజేశారు. శిబిరాన్ని పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

చిత్తడి నేలలపై విద్యార్థులకు అవగాహన



మచిలీపట్నంటౌన్: ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా జిల్లా అటవీశాఖ మచిలీపట్నం నియోజకవర్గంలోని గిలకలదిండి, తపసిపూడి, మంగినపూడి ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని విద్యార్థులకు చిత్తడి నేలలు, మానవ శ్రేయస్సు అనే అంశంపై అవగాహన కల్పించారు. భారత ప్రభుత్వ ఆదేశాల మేరకు చిత్తడి నేలల సంరక్షణ, వాటి ఆవశ్యకతపై ఈ సందర్భంగా అటవీశాఖ ఉద్యోగులు విద్యార్థులకు వివరించారు. చిత్తడి నేలల్లో చేపలు, వివిధ రకాల పక్షులు, ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వివరించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి విద్యార్థులకు చిత్తడి నేలలను చూపించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు షరీఫ్, సుజాత, సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు



విద్యుత్ కాంతుల్లో ఉన్న గిలకలదిండి జగనన్న కాలనీ వద్ద పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 20వ డివిజన్ గిలకలదిండిలో ఏర్పాటు చేసిన నూతన జగనన్న కాలనీలో విద్యుద్దీకరణ పనులను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ గతంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా అర్హత ఉన్న ప్రతి పేదవానికి ఇంటి స్థలాన్ని ఇచ్చి ప్రతి గ్రామంలోనూ జగనన్న కాలనీని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గిలకలదిండి గ్రామం ఏర్పడిన తరువాత ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఇక్కడి ప్రజలకు నివేశన స్థలాలు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సీఎం జగన్ ఆధ్వర్యంలోనే ఈ ప్రాంతంలోని 940 మందికి పైగా పేదలకు నివేశన స్థలాలు ఇచ్చి పెద్ద కాలనీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కాలనీలో విద్యుద్దీకరణ పనులు పూర్తయి శుక్రవారం ప్రారంభించామన్నారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని పేదలకు ఎమ్మెల్యే పేర్ని నాని ప్రత్యేక చొరవతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నివేశన స్థలాలు కేటాయించటం సంతోషదాయకమన్నారు. ఈ స్థలాల్లో లబ్ధిదారులు గృహనిర్మాణం వేగవంతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, 20, 21 డివిజన్ల కార్పొరేటర్లు తిరుమలశెట్టి వరప్రసాద్, మన్నే శారద, ఎలక్ట్రికల్ ఏడీఈ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘోరీమా అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే పేర్ని నాని



ఘోరీమా పాడెను మోస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా మాతృమూర్తి షేక్ ఘోరీమా (97) అంతిమయాత్రలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పాల్గొన్నారు. ఘోరీమా గురువారం సాయంత్రం మృతి చెందటంతో శుక్రవారం మధ్యాహ్నం అంతిమయాత్ర నిర్వహించారు. అచ్చెబా సోదరుని నివాసం నుంచి ప్రారంభమైన అంతిమయాత్రలో ఎమ్మెల్యే పేర్ని నాని పాల్గొని పాడెను మోశారు. ఉదయం అచ్చెబాను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), నగర డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, నజాఫ్అలీ, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు.

పెడన పోలీస్ స్టేషన్‌కు ఆఫీసు టేబుల్ వితరణ

అందజేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిన్నా



ఎస్‌ఐ రవిచంద్రకుమార్‌కు టేబుల్‌ను అందజేసిన ఆర్యవైశ్య సంఘ నాయకులు చిన్నా తదితరులు

పెడన: పెడన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా శుక్రవారం పెడన ఎస్‌ఐ రవిచంద్రకుమార్‌కు కలప(వుడ్) ఆఫీస్ టేబుల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ నిర్మాణంలో కూడా ఆర్యవైశ్య సంఘం సహాయ సహకారాలందించిందని, పెడన పోలీస్ వారు నిర్వహించే సమావేశాలకు శ్రీ వాసవి ప్రార్థన మందిరం (కల్యాణమండపం) ఇచ్చి సహకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవిచంద్రకుమార్ పట్టణ ఆర్యవైశ్య సంఘం వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆత్మకూరి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కేటీ మురళీకృష్ణ, ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లు రాధాకృష్ణ గుప్తా, కార్యదర్శి జవాజి నాగు, కృష్ణాజిల్లా వాసవి సేవాదళ్ వైస్ చైర్మన్ చిలకల బాలాజీ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నాయీ బ్రాహ్మణ సంఘం క్యాలెండర్‌ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, కడవకొల్లు, వికాస్

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం క్యాలెండర్‌ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అందుకే గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలు జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, యువనాయకుడు సింహాద్రి వికాస్, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు అవనిగడ్డ బ్రహ్మయ్య, మోపిదేవి మండల అధ్యక్షుడు రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం, నాయకులు ముక్కొల్లు హనుమంతరావు, నారేపాలెం శ్రీనివాసరావు, మోపిదేవి భాస్కరరావు, అవనిగడ్డ శ్రీనివాస్, రంగనాథ్ పాల్గొన్నారు.

నాగాయలంకలో రేపు నేత్ర వైద్య శిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం తెలిపారు. మర్రిపాలెం గ్రామానికి చెందిన మండ సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వరరావు ఆర్థిక సౌజన్యంతో నాగాయలంకలోని మారుతి డిజిటల్ స్కూలు ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు శిబిరం జరుగుతుందన్నారు. శుక్లాలు ఉండి అవసరమైన వారికి కంటి లోపల అద్దాలు అమర్చే(ఐఓఎల్) ఆపరేషన్‌లు శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ తెలిపారు.

నాగాయలంకలో 93.6 శాతానికి చేరిన కులగణన

ఏటిమొగ(నాగాయలంక): మండలంలో కులగణన సర్వే 93.6 శాతం కుటుంబాలలో పూర్తయిందని మండల విస్తరణాధికారిణి కె.అప్పలనరసమ్మ శుక్రవారం చెప్పారు. ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ పర్యవేక్షణలో మండలంలో కులగణన సర్వే వేగంగా సాగుతోందన్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో గణపేశ్వరం, నంగేగడ్డ, భావదేవరపల్లి సచివాలయాలు 97 శాతం కులగణన పూర్తి చేసి అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. మరో అయిదు సచివాలయాల్లో 95 శాతం సర్వే పూర్తి కాగా 93.6 శాతం కుటుంబాల సర్వేతో 41,866 మంది కులగణన వివరాలు నమోదు అయినట్లు వివరించారు. ఇక మండలం మొత్తంలో కేవలం 1092 కుటుంబాల కులగణన వివరాలు మాత్రమే నమోదు చేయాల్సి ఉందన్నారు.

బాగా చదివి కళాశాలకు గుర్తింపు తేవాలి

పెడన: విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలని ఉన్నత విద్య విశ్రాంత డీవైఈవో మట్టా రాధాకృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఉచిత మధ్యాహ్న భోజన పథకానికి శుక్రవారం భోజనానికి అయ్యే ఖర్చు రూ.5వేలను కళాశాల లైబ్రేరియన్ సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవికి రాధాకృష్ణమూర్తి అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సామాన్యులకు ఆరోగ్య భద్రత

ఏటిమొగ వైద్య శిబిరంలో 400 మందికి పరీక్షలు



నాగాయలంక మండలం ఏటిమొగలో రోగులకు పరీక్షలు జరిపిన వైద్యాధికారులు

ఏటిమొగ(నాగాయలంక): మండలంలోని పెదపాలెం, ఏటిమొగ పంచాయతీల పరిధిలో శుక్రవారం ఏటిమొగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో రెండో విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించారు. పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)సేవలతో పేదలు, సామాన్య ప్రజలకు సకల ఆరోగ్య సంపద చేకూరుతుందని అన్నారు. శిబిరంలో మొత్తం 400 మంది పేషెంట్‌లకు పరీక్షలు జరిపి ఉచితంగా మందులను అందజేశారు. వైద్యాధికారులు డాక్టర్ ఫాతిమున్నీసా, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ శ్యామ్ సుందర్, నేత్రవైద్యురాలు ఎం.శ్రీలక్ష్మి రోగులకు వైద్యపరీక్షలు జరిపారు. ఎంపీటీసీ సభ్యురాలు విశ్వనాథపల్లి నాగలక్ష్మి, ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ, గ్రామ కార్యదర్శి ఆదిశేషు, నాయుడు దుష్యంతుడు, సచివాలయం సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

11న కన్యకాంబ ఆత్మార్పణ మహోత్సవం



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి

నాగాయలంక: శ్రీఆర్యవైశ్యసంఘం, శ్రీవాసవీ సేవాదళ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23న కన్యకాంబ అమ్మవారి 4641వ ఆత్మార్పణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సంఘం అధ్యక్షుడు చిట్టా సాంబశివరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమాలను ఇలా వివరించారు. ఉదయం 9గంటలకు కృష్ణానది నుంచి తెచ్చిన 108 బిందెల పవిత్ర జలంతో తదుపరి 108 కేజీల బియ్యంతో తొలుత అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి పంచామృతం, పసుపు, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకిస్తారు. అభిషేకించిన బియ్యంతో వేడుకలో పాల్గొన్న భక్తులకు అన్న సంతర్పణ చేస్తారు.11.30 గంటలకు అష్టోత్తర సహస్రనామ కుంకుమార్చన, సంకర్షణ భజన మండలి సభ్యులచే సామూహిక వాసవీమాత పారాయణం, 12.30 గంటలకు నీరాజన మంత్ర పుష్పం రాత్రి 7.30 గంటలకు అమ్మవారి పవళింపు సేవ కార్యక్రమాలు జరుగుతాయి. దివిసీమ వ్యాప్తంగా భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న కృషి



పేపరు ప్లేట్ల తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

పెడన: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. స్థానిక ఒకటో వార్డులో మెప్మా ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని శుక్రవారం నాగకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లేట్ల తయారీ కేంద్రాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారన్నారు. మనందరి సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకు మనమంతా అండగా ఉందామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రామును పెడన ఎమ్మెల్యేగా గెలిపించాలని, వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, కౌన్సిలర్లు కటకం ప్రసాద్, పిచ్చిక సతీష్ బాబు, రాహేతున్నిసా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బందారు మల్లికార్జునరావు, సచివాలయాల కన్వీనర్ మతిన్‌ఖాన్, వీణం రాము, వన్నం శ్రీలత, మెప్మా టీఎంసీ భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంయూడీఏ వీసీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ



కలెక్టర్ రాజాబాబుకు మొక్కను అందజేస్తున్న ఎంయూడీఏ వైస్‌చైర్మన్ ఎం.వెంకటేశ్వర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) వైస్‌చైర్మన్‌గా ఎం.వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు వైస్‌చైర్మన్‌గా పనిచేసిన కె.రాజ్యలక్ష్మి గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. దీంతో ఏలూరు జిల్లా డీఆర్వోగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును ఎంయూడీఏ వీసీగా నియమించారు. వెంకటేశ్వర్లు శుక్రవారం కలెక్టర్ పి.రాజాబాబు ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కలెక్టర్‌ను కలిసిన గుడివాడ మునిసిపల్ కమిషనర్

కలెక్టర్ పి.రాజాబాబును శుక్రవారం గుడివాడ మునిసిపల్ కమిషనర్‌గా నియమితులైన బాలసుబ్రహ్మణ్యం, జిల్లా కేఆర్ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన శ్రీదేవి మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

సంక్షిప్త వార్తలు

సిద్ధం సభకు సన్నద్ధం

మచిలీపట్నంటౌన్: ఈ నెల 3వ తేదీ శనివారం దెందులూరులో జరిగే సిద్ధం సభకు మచిలీపట్నం నియోజకవర్గం నుంచి తరలివెళ్లేందుకు వైఎస్సార్ సీపీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. నియోజకవర్గం నుంచి దాదాపు 100కు పైగా బస్సుల్లో కార్యకర్తలు తరలివెళ్లనున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కన్వీనర్లతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సిద్ధం సభకు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారని, వారికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధం కావాలి

గూడూరు: ఏలూరులో నిర్వహించనున్న సిద్ధం సభకు పార్టీ శ్రేణులంతా సమాయత్తం కావాలని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు పిలుపునిచ్చారు. సిద్ధం సభకు ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ఎంపీపీ శుక్రవారం గూడూరులో ప్రారంభించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 3వ తేదీ శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు మరమ్మతులు చేస్తారన్నారు. నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్‌కాలనీ, కేంద్రీయ విద్యాలయం, మేదర కాలనీ, పాత హౌసింగ్‌బోర్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

గోవుల స్వాధీనం

బంటుమిల్లి: మండల పరిధిలోని 216 వ నంబరు జాతీయ రహదారిపై పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా గోవులతో వెళుతున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ ఎ.పైడిబాబు తెలిపిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీలు చేస్తుండగా విజయనగరం నుంచి మచిలీపట్నంకు ఏడు ఆవులను తీసుకువెళుతున్న వ్యాన్‌ను ఆపి తనిఖీ చేశారు. డ్రైవరు వద్ద ఎటువంటి ధ్రువపత్రాలు లేకపోవడంతో వ్యాన్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు చెప్పారు. గోవులను చల్లపల్లి మండలం కృష్ణస్వామి ఆశ్రమంలోని గోశాలకు తరలించి రక్షణ కల్పించామన్నారు.

ముస్లింలంతా ఏకతాటిపైకి రావాలి



పెడన: ముస్లింలు అంతా తమ హక్కుల సాధన కోసం ఏకతాటి పైకి రావాలని పలువురు ముస్లిం వక్తలు పిలుపునిచ్చారు. పెడన పట్టణంలో ముస్లిం ఐక్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం ముస్లిం జోడో యాత్ర నిర్వహించారు. పెడన - గుడివాడ రోడ్డులోని పెద్ద మసీదు వద్ద ఈ యాత్ర ప్రారంభించి బస్టాండు వరకు కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం పెద్దలు ఖలీల్ సయ్యద్, అబ్దుల్ కలాం, అబ్దుల్ అజీజ్, పెడనకు చెందిన అయూబ్‌ఖాన్, హమీమ్‌ఖాన్, అబ్దుల్ ఖదీర్, హమీదుల్లా తదితర ముస్లిం పెద్దలు, యువకులు ఈ యాత్రలో పాల్గొన్నారు.

పెడన సీఐ, నలుగురు ఎస్‌ఐలు బదిలీ

పెడన: పెడన పోలీస్ సర్కిల్ పరిధిలో సీఐ హబీబ్ బాషాతో పాటు పెడన, కృత్తివెన్ను, బంటుమిల్లి, గూడూరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పెడన సీఐ హబీబ్‌బాషా ఉయ్యూరు సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏలూరు రేంజ్ నుంచి కె.నాగేంద్రప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పెడన ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్‌ను ఉంగుటూరుకు బదిలీ చేయగా ఆత్కూరు ఎస్‌ఐ టి.సూర్య శ్రీనివాస్‌ను పెడన ఎస్‌ఐగా నియమించారు. కృత్తివెన్ను ఎస్‌ఐ ఎ.గణేష్‌కుమార్‌ను ఉయ్యూరుకు బదిలీ చేయగా ఆయన స్థానంలో గన్నవరం ఎస్‌ఐ కె.నాగరాజును నియమించారు. బంటుమిల్లి ఎస్‌ఐ పైడిబాబును ఆత్కూరుకు బదిలీ చేసి, ఉయ్యూరు ఎస్‌ఐ జి.వాసు బంటుమిల్లికి బదిలీ చేశారు. గూడూరు ఎస్‌ఐ వి.శేషకుమార్‌ను పెనమలూరు ఎస్‌ఐగా బదిలీ చేశారు. గూడూరు పీఎస్‌కు ఎవరినీ నియమించలేదు.

బందరు తహసీల్దార్ బదిలీ

కోనేరుసెంటర్: బందరు తహసీల్దార్ ఎం.శ్రీవిద్య బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బందరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీవిద్యను మోపిదేవి మండలానికి బదిలీ చేశారు. పశ్చిమ గోదావరి నుంచి పి.సతీష్‌ను బందరు మండలంలోని నార్త్‌జోన్‌కు, పీఎస్‌పీఎస్ లక్ష్మిని సౌత్‌జోన్‌కు తహసీల్దార్లుగా నియమించారు.

రాజ్యలక్ష్మికి సత్కారం

పెడన: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఈఆర్వో కె.రాజ్యలక్ష్మి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం డీటీ కల్పన, పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.పూర్ణచంద్రరరావు, ఆర్‌ఐ మణికుమార్, నాలుగు మండలాలకు చెందిన రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ డీఈకి ఘన సన్మానం

అవనిగడ్డ: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న పంచాయతీరాజ్ డీఈ బందారు వెంకటేశ్వరరావుని శుక్రవారం ఘనంగా సత్కరించారు. స్థానిక డీఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పలువురు ఏఈలు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఇంజినీర్లు వెంకటేశ్వరరావుని సత్కరించారు.

కృత్తివెన్ను తహసీల్దార్‌గా సుందర్‌సింగ్

కృత్తివెన్ను: కృత్తివెన్ను తహసీల్దార్‌గా జి.సుందర్‌సింగ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈయన బదిలీపై కృత్తివెన్ను మండలానికి వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రామకోటేశ్వరరావు కాకినాడ జిల్లా కరప మండల తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

బంటుమిల్లి ఎస్‌ఐగా వాసు బాధ్యతల స్వీకారం

బంటుమిల్లి: బంటుమిల్లి స్టేషన్ హౌస్ ఆఫీసరు(ఎస్ఐ)గా గోనబోయిన వాసు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఈయన ఉయ్యూరు స్టేషన్ నుంచి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎ. పైడిబాబు ఆత్కూరుకు బదిలీ అయ్యారు.

కృత్తివెన్ను ఎస్‌ఐగా నాగరాజు...

కృత్తివెన్ను: కృత్తివెన్ను ఎస్‌ఐగా కె.నాగరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గన్నవరం ఎస్‌ఐగా పనిచేసిన నాగరాజు బదిలీపై కృత్తివెన్నుకు వచ్చారు. కృత్తివెన్ను ఎస్‌ఐగా సేవలందించిన గణేష్‌కుమార్ ఉయ్యూరు పట్టణానికి బదిలీపై వెళ్లారు.

ఘంటసాల ఎస్‌ఐగా ప్రతాప్‌రెడ్డి...

ఘంటసాల(అవనిగడ్డ): ఘంటసాల ఎస్‌ఐగా కె.ప్రతాప్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటానని చెప్పారు.

తహసీల్దార్ సత్యనారాయణకు సత్కారం

బంటుమిల్లి: ఎన్నికల బదిలీల్లో భాగంగా ఉద్యోగోన్నతిపై వెళుతున్న తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణకు శుక్రవారం సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. వీఆర్‌ఓ, వీఆర్‌ఏల సంఘ నాయకులు, కార్యాలయ సిబ్బంది ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఎఫ్‌డీఓ సత్యనారాయణకు సన్మానం

కోడూరు: గణతంత్ర దినోత్సవం నాడు కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న కోడూరు ఎఫ్‌డీఓ వానపల్లి సత్యనారాయణను శుక్రవారం వీఎఫ్ఏలు దుశ్శాలువాలతో సత్కరించి బొకేలు అందించారు.